

మోదీ కన్నీటిని ఆయన కళ్లే నమ్మవు!

- హిందీని నిర్బంధం చేయలేదా?.. తమిళభాషపై కపట ప్రేమ ప్రదర్శిస్తారా?
- ప్రధానిపై సీఎం స్టాలిన్ ధ్వజం



సేలంలో డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్‌ను కలుసుకున్న ఎంఎన్ఎం అధినేత కమల్

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తమిళభాషపై మోదీ కారుస్తున్న కన్నీటిని ఆయన కళ్లు కూడా నమ్మవని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దుయ్యబట్టారు. అంతటా హిందీ... అన్నింటా హిందీ అంటూ అన్ని రాష్ట్రాల్లో ఆ భాషను నిర్బంధం చేసి ప్రధాని నరేంద్రమోదీ తమిళభాషపై కపట ప్రేమను ప్రదర్శిస్తున్నారంటూ ధ్వజమెత్తారు. ఆ మేరకు శనివారం తన ఎక్స్‌పేజీలో ఓ ప్రకటన జారీ చేస్తూ... శుక్రవారం సాయంత్రం బీజేపీ రాష్ట్ర నాయకులతో మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ తమిళ భాషను నేర్చుకోలేకపోయాననే బాధ తనను పట్టిపీడిస్తోందంటూ విలపించడం విడ్డూరంగా ఉందన్నారు. అన్ని రాష్ట్రాల కన్నా తమిళనాట అన్ని చోట్లా అధికంగా హిందీని నిర్బంధంగా అమలు చేస్తున్న మోదీ తమిళభాష గొప్పదని పదేపదే చెబుతుండటాన్ని ప్రజలంతా ఏవగించుకుంటున్నారని స్టాలిన్ పేర్కొన్నారు. తమిళం తనకు మాతృభాషగా లేదేనని పదేపదే బాధపడుతున్నానని బీజేపీ నేతల సమావేశంలో మోదీ చెప్పడం కపట ప్రేమేనని అందరికీ తెలుసని, ఓ వైపు తమిళభాషను పొగడుతూ మరో వైపు రేడియో స్టేషన్లకు అందమైన 'వానొలి' అనే తేనెలాంటి తమిళ పదం ఉంటే ఆ పదం ససేమిరా వద్దు 'ఆకాశవాణి' అనే పదమే కొనసాగుతుందని ప్రకటించింది కూడా మోదీయేననే విషయం తమిళులందరికీ తెలిసిన సంగతేనని పేర్కొన్నారు. తమిళ ప్రజలందరికీ తానొక విషయాన్ని గుర్తు చేయదలిచానని, గతంలో రాష్ట్రంలో ఏ సభలో పాల్గొన్నా మోదీ ఆంగ్లంలో ప్రసంగించేవారని, ప్రస్తుతం ప్రతి సభలోనూ హిందీలోనే ప్రసంగించడం వెనుక దాగిన మర్మమేమిటో చెప్పగలరా అని స్టాలిన్ ప్రశ్నించారు. నల్లధనాన్ని వెలికి తీస్తాం... తమిళ జాలర్లను కాపాడుతాం, రెండు కోట్ల మంది ఉద్యోగావకాశాలు కల్పిస్తాం... అవినీతిని అంతమొందిస్తామంటూ దేశప్రజలకు మోదీ ఇచ్చిన గ్యారెంటీలన్నీ ఏమయ్యాయో తెలపాలని డిమాండ్ చేశారు. విమానాశ్రయాల్లో తమిళంలో ప్రకటనలు చేస్తామన్న హామీ కూడా గాలిలో కలిసిపోయిందన్నారు. ప్రకటనలు సరే రాష్ట్రంలోని అన్ని విమానాశ్రయాల్లో తమిళం తెలిసిన భద్రతా సిబ్బంది ఒక్కరు కూడా లేదన్న విషయం మోదీకి తెలియజేస్తున్నానని స్టాలిన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కమల్‌తో భేటీ....

ఇదిలా ఉండగా సేలం ప్రచార సభలో పాల్గొనేందుకు వెళ్లిన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌ను మక్కల్ నీదిమయ్యం అధినేత కమలహాసన్ కలుసుకున్నారు. శుక్రవారం రాత్రి ఈరోడ్‌లో డీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేసిన కమల్ సేలం మామాంగం ప్రాంతంలోని ప్రైవేటు గెస్ట్ హౌస్‌లో బస చేశారు. ఆ ప్రాంతానికి చేరువగానే ఉన్న మరో గెస్ట్‌హౌస్‌లో స్టాలిన్ బస చేశారు. ఈ విషయం తెలుసుకున్న కమల్ శనివారం ఉదయం సీఎం బస చేస్తున్న గెస్ట్‌హౌస్‌కు వెళ్ళి మర్యాదపూర్వకంగా ఆయన్ను కలుసుకున్నారు. ఆ సందర్భంగా ఇరువురూ ఎన్నికల ప్రచార వ్యూహాలపై చర్చలు జరిపారు. సుమారు అరగంటసేపు ఇరువురూ సమావేశమయ్యారు. ఆ తర్వాత కమల్ చెన్నైకి బయలుదేరారు.

అభ్యర్థుల తుది జాబితా విడుదల

- బరిలో 950 మంది

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియటంతో శనివారం సాయంత్రం పోటీలో మిగిలిన అభ్యర్థుల జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు విడుదల చేశారు. ఏప్రిల్ 19న జరగనున్న లోక్‌సభ ఎన్నికలకుగాను ఈనెల 27 వరకు నామినేషన్లు స్వీకరించారు. మొత్తం 1749 నామినేషన్లు దాఖలయ్యాయి. గురువారం నామినేషన్ల పరిశీలన జరిగింది. సరైన దస్తావేజులు జత చేయకపోవడం, వివరాలు అసంపూర్తిగా ఉండటం తదితర కారణాల వల్ల 664 దరఖాస్తులను తిరస్కరించారు. 1085 నామినేషన్లను అంగీకరించారు.ఈ నేపథ్యంలో శనివారం మధ్యాహ్నం 3గంటలకు నామినేషన్ల ఉపసంహరణ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 135మంది అభ్యర్థులు ఉప సంహరించుకున్నారు. వీరిలో 874 మంది పురుషులు, 76 మంది మహిళ బరిలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ తర్వాత తిరువళ్లూరులో 14 మంది, నార్త్ చెన్నైలో 35 మంది, సౌత్‌చెన్నైలో 41 మంది, సెంట్రల్ చెన్నైలో 31 మంది అభ్యర్థులు మిగిలారు. ఇదే విధంగా శ్రీపెరుంబుదూరులో 31 మంది, కాంచీపురం 11 మంది, అరక్కోణంలో 26 మంది, వేలూరులో 31 మంది, కృష్ణగిరి 27, ధర్మపురి 24, తిరువణ్ణామలై 31, ఆరణి 29, విలుపురం 17, కల్లకుర్చి 21, సేలం 25, నామక్కల్ 40, ఈరోడ్ 31, తిరుప్పూరు 13, నీలగిరి 16, కోయంబత్తూరులో 37, పొల్లాచ్చి 15, దిండుగల్ 15, కరూర్ 54, తిరుచ్చి 35, పెరంబలూరు 23, కడలూరు 19, చిదంబరం 14, మైలాడుదురై 17, నాగపట్టినం 9, తంజావూరు 12, శివగంగ 20, మదురై 21, తేని 25, విరుదునగర్ 27, రామనాథపురం 25, తూత్తుకుడి 28, తెన్‌కాశి 15, తిరునెల్వేలి 23, కన్నియాకుమారి 22 మంది పోటీ చేస్తున్నారు. అత్యధికంగా కరూరులో 54 నామినేషన్లు దాఖలు కాగా అత్యల్పంగా నాగపట్టినంలో 9 మాత్రమే దాఖలవడం గమనార్హం. అభ్యర్థుల జాబితాను విడుదల చేసిన తర్వాత ఆయా నియోజకవర్గాలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు చిహ్నాలను కేటాయించారు.

బీజేపీ దశాబ్ద పాలనలో రాష్ట్ర సంక్షేమాన్ని విస్మరించింది

ఈపీఎస్ ఆగ్రహం • డీఎంకే కంటే అన్నాడీఎంకే పటిష్ఠంగా ఉంది



అన్నాడీఎంకేలో చేరుతున్న పెరియస్వామి

అడయార్, మార్చి 30: కేంద్రంలో గత పదేళ్లుగా ఉన్న ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో రాష్ట్ర సంక్షేమాన్ని విస్మరించిందని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి విమర్శించారు. ఉత్తరాది రాష్ట్రాలైన గుజరాత్, ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలతో పోల్చితే తమిళనాడు, తమిళ ప్రజలకు ఉపయోగపడేలా పథకాలను అమలు చేయలేదన్నారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమైవున్న ఎడప్పాడి... ఓ మీడియాకు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. తిరుచ్చిలో జరిగిన బహిరంగ సభలోనే తమ పార్టీ అభ్యర్థులను పరిచయం చేసి, ఎన్నికల ప్రచారాన్ని కూడా ప్రారంభించినట్టు చెప్పారు. తమ పార్టీ అనేక ఎన్నికలను ఎదుర్కొందన్నారు. తానే దాదాపు 10 రకాలైన ఎన్నికల్లో పోటీ చేశానని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో డీఎంకే పటిష్ఠంగా ఉన్నట్టు ప్రచారం సాగుతుందన్నారు. కానీ, వాస్తవానికి క్షేత్రస్థాయిలో అన్నాడీఎంకే ఎంతో బలంగా ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో అధికార డీఎంకే ధన, అధికార బలాన్ని ఉపయోగించి అక్రమాలకు పాల్పడి విజయం సాధించాలని భావిస్తోందన్నారు. తమ పార్టీ వ్యవస్థాపకుడు దివంగత డాక్టర్ ఎంజీఆర్ పటిష్ఠ పునాదులు వేయగా, దివంగత జయలలిత ఆ పునాదులను మరింత బలోపేతం చేశారని చెప్పారు. 2014లో జరిగిన ఎన్నికల్లో ఎలాంటి పొత్తు లేకుండానే తాము ఒంటరిగా పోటీ చేసి విజయం సాధించామన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే రాష్ట్రాల్లో జాతీయ పార్టీ అధికారంలో ఉండాలన్న వాదనను తాము తోసిపుచ్చుతున్నట్టు చెప్పారు. అనేక సందర్భాల్లో రాష్ట్రాల ప్రయోజనాలను జాతీయ పార్టీలు పట్టించుకోవడం లేదని ఆయన విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అధిక సంఖ్యలో ఎంపీలను గెలుచుకుంటుందన్నారు. అలాగే, కొత్తవారు ప్రధానిగా బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. ఈ ప్రధానమంత్రి అభ్యర్థి ఎంపికలో అన్నాడీఎంకే కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అన్నాడీఎంకేలో చేరిన తడా పెరియస్వామి

భారతీయ జనతా పార్టీ షెడ్యూల్ తరగతుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తడా పెరియస్వామి సొంత పార్టీకి రాజీనామా చేసి అన్నాడీఎంకేలో చేరారు. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి కె.పళనిస్వామి సమక్షంలో అన్నాడీఎంకే సభ్య త్వం స్వీకరించారు. షెడ్యూల్ కులాల ప్రజలపై జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన తడా పెరియస్వామి 1983లో నక్సల్‌బరి ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. అరియలూరు మైలాడుదురైలో జరిగిన బాంబు పేలుడు కేసులో జాతీయ భద్రతా చట్టం కింద అరెస్టయ్యారు. ఆ తర్వాత విడుదలైన ఆయన 1990లో డీపీఐలో చేరారు. 2001లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత డీపీఐ ప్రధాన కార్యదర్శి తోల్ తిరుమావళవన్‌తో మనస్పర్థల కారణంగా ఆ పార్టీ నుంచి వైదొలిగారు. 2006లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వరగూరు స్థానం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఈ నేపథ్యంలో ఆయన లోక్‌సభ ఎన్నికలకు ముందు ఆయన అన్నాడీఎంకేలో చేరారు.

ఓపీఎస్‌కు పనసపండు చిహ్నం



చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం లోక్‌సభ నియోజకవర్గంలో ఎన్డీయే తరఫు స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం (ఓపీఎస్)కు పనసపండు గుర్తు కేటాయించారు. బక్కెట్ గుర్తు కేటాయించాలని ఓపీఎస్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. అదే సమయంలో ఆ నియోజకవర్గంలో ఆయన పేరుతోనే పోటీ చేస్తున్న ఆరుగురిలో ఓ ఇండిపెండెంట్‌కు బక్కెట్ గుర్తును కేటాయించారు. తనకు పనసపండు గుర్తు కేటాయించడం పట్ల ఓపీఎస్ హర్షం ప్రకటించారు. ఇదిలా ఉండగా వేలూరు నియోజకవర్గంలో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్న తమిళ సినీ విలన్ నటుడు మన్సూర్ అలీఖాన్‌కు కూడా పనసపండు గుర్తును కేటాయించారు. తనకు లారీ, క్రికెట్ బ్యాట్, పనసపండు గుర్తుల్లో ఏదైనా ఒకదానిని కేటాయించాలని రిటర్నింగ్ అధికారికి ఆయన దరఖాస్తు పెట్టుకున్నారు. పనసపండు గుర్తు లభిస్తే ఆ పండును తలపై పెట్టుకుని ఓట్ల అభ్యర్థనకు వెళతానని కూడా ప్రకటించారు. చివరకు శనివారం సాయంత్రం తనకు పనసపండు గుర్తు కేటాయించినట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించగానే మన్సూర్ అలీఖాన్ సంతోషానికి పట్టపగ్గాలు లేకపోయింది.

ప్రేమలత వస్త్రధారణలో మార్పు



కొత్త వస్త్రధారణతో ప్రచారం చేస్తున్న ప్రేమలత

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఎన్నికల ప్రచార సందర్భంగా తన గెటప్ మార్చారు. ఉన్నట్టుండి ఫుల్‌హ్యాండ్ జాకెట్టు, గులాబీ రంగు చీర ధరించి ప్రచార సభల్లో పాల్గొని పార్టీ శ్రేణులకు విస్మయం కలిగించారు. ఈ వస్త్రధారణతో ప్రేమలతలో గాంభీర్యం అధికమైందని పార్టీ నేతలు చెబుతున్నారు. అన్నాడీఎంకే కూటమి అభ్యర్థులకు మద్దతుగా ఆమె సాగిస్తున్న ప్రచార పర్యటనలో ఈ డ్రెస్‌కోడ్‌తోనే పాల్గొననున్నారని పార్టీ ప్రముఖులు తెలిపారు.

ఎట్టకేలకు డీపీఐకి కుండ గుర్తు

- ఎండీఎంకేకు అగ్గిపెట్టె



చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి తరఫున పోటీ చేస్తున్న డీపీఐకి కేంద్ర ఎన్నికల సంఘం ఎట్టకేలకు కుండ గుర్తును కేటాయించింది. ఈ ఎన్నికల్లో డీపీఐ తరఫున ఆ పార్టీ నేత తిరుమావళవన్ చిదంబరంలో, ప్రధాన కార్యదర్శి దురై రవికుమార్ విల్లుపురంలో పోటీ చేస్తున్నారు. ఇదే విధంగా కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, తెలంగాణ రాష్ట్రాల్లోనూ డీపీఐ పోటీ చేస్తోంది. ఈ పరిస్థితులలో తమపార్టీకి కుండ గుర్తు కేటాయించాలని ఢిల్లీ హైకోర్టులో తిరుమావళవన్ పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ తోసివేతకు గురైంది. ఆ తర్వాత అప్పీలు చేసుకోగా కుండ గుర్తు కేటాయించే విషయాన్ని ఎన్నికల సంఘం పరిశీలించి నిర్ణయాన్ని ప్రకటించాలని ఆదేశించింది. అయితే కేంద్ర ఎన్నికల సంఘం కుండ గుర్తు కోసం సమర్పించిన దరఖాస్తుతో పాటు ప్రస్తుత ఆర్థికసంవత్సరానికి సంబంధించి పార్టీ జమా ఖర్చులను జత చేయలేదంటూ ఆ గుర్తును కేటాయించలేమంటూ పేర్కొంది. ఈ నిర్ణయంపై మళ్లీ డీపీఐ న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. చివరకు ఆ పార్టీ కోరుకున్నట్లే కుండ గుర్తు లభించింది. ఈ విషయాన్ని ముందుగానే పసిగట్టిన తిరుమావళవన్ శుక్రవారం రాత్రి కుండను చేత పట్టుకుని ఈ చిహ్నానికే ఓటు వేయాలంటూ నినాదం చేస్తున్న వీడియోను విడుదల చేశారు. ఇదిలా ఉండగా ఈ ఎన్నికల్లో ఎండీఎంకేకు అగ్గిపెట్టె చిహ్నాం కేటాయిస్తూ ఎన్నికల సంఘం ప్రకటన జారీ చేసింది. తిరుచ్చిలో ఆపార్టీ ప్రధానకార్యదర్శి దురై వైగో పోటీ చేస్తున్నారు.ఆఎన్నికల్లో బొంగరం చిహ్నం కోసం ఆయన తీవ్ర ప్రయత్నాలు చేసినా ఫలితం లేకపోయింది. చివరకు పడవ లేదా అగ్గిపెట్టె చిహ్నం కేటాయించాలని ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశారు. ఆ పార్టీకి అగ్గిపెట్టె గుర్తును కేటాయిస్తున్నట్లు ఎన్నికల సంఘం ప్రకటన చేసింది.


నేడు ఈస్టర్

- చర్చిల్లో తెల్లవారుజాము నుంచే ప్రత్యేక ప్రార్థనలు

ప్యారీస్, మార్చి 30: వసంత రుతువులో వచ్చే ఈస్టర్ క్రైస్తవులకు అతిపెద్ద పండుగ. మానవాళి శ్రేయస్సు కోసం శిలువపై మరణించిన ప్రభువైన క్రీస్తు తిరిగి మూడో రోజు పునరుత్థానమైన సందర్భాన్ని క్రైస్తవులు ఈస్టర్ పండుగగా కోలాహలంగా జరుపుకొనేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆదివారం తెల్లవారుజామున 4 గంటల నుంచే క్రైస్తవులు ఈస్టర్ వేడుకలు జరుపుకున్నారు. పునరుత్థానుడైన క్రీస్తును స్వాగతిస్తూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. 40 రోజులుగా ఉపవాసదీక్షలు చేసిన వారంతా శుభ శనివారం రోజున దీక్ష విరమించారు. కాగా, ఈస్టర్ పర్వదినం సందర్భంగా ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని కోరుతూ పలు రాజకీయ పార్టీల నేతలు శుభాకాక్షలు తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు సెల్వపెరుందగై, పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ వేర్వేరుగా శుభాకాంక్షలు తెలుపుతూ ప్రకటనలు విడుదల చేశారు.

రంజాన్ వేళలు

ఆదివారం : ఇఫ్తార్ : సాయంత్రం - 6.27
సోమవారం : సహర్ : ఉదయం - 4.24




గంజాయి రహిత నగరంగా చెన్నై

- పోలీసుల చర్యలు

ప్యారీస్, మార్చి 30: గంజాయి రహిత నగరంగా చెన్నైను మార్చేందుకు చర్యలు చేపట్టిన పోలీసులు, తనిఖీలు ముమ్మరం చేశారు. ముఖ్యంగా గంజాయి విక్రయాలు అడ్డుకొనేందుకు ఆకస్మిక చర్యల్లో దిగారు. వాహనాల ద్వారా చట్టవిరుద్ధంగా తరలిస్తున్న గంజాయిని తమకందిన రహస్య సమాచారంతో అప్పటికప్పుడు స్వాధీనం చేసుకుంటున్నారు. బస్సులు, రైళ్లలో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకుంటున్నందువల్ల కొంతమంది సంఘ విద్రోహులు గంజాయికి బదులుగా మత్తు బిళ్లలను విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా ఆర్డరు చేసి మత్తుబిళ్లలను సరఫరా చేస్తున్న ప్రైవేటు కొరియర్ సంస్థలపై నగర పోలీసులు దృష్టి సారించారు. ఈ సంస్థల వివరాలతో పాటు గంజాయి విక్రయాల్లో పేరుగాంచిన రౌడీలు, మాజీ నేరస్థుల వివరాలు సేకరించి ఆ కోణంలో విచారణ చేపట్టారు. విద్యాసంస్థలు, భవన నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాల్లో మత్తుబిళ్లలు విక్రయిస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. గుజరాత్, మహారాష్ట్రల నుంచి పార్శిల్ ద్వారా వచ్చే మత్తుబిళ్లలను మద్యానికి బానిసలైన వారికి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. వారం రోజుల్లో మాత్రమే గంజాయి, మత్తుబిళ్లలు విక్రయించిన 40 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి సుమారు 2,000 మత్తుబిళ్లలు స్వాధీనం చేసుకు వారి బ్యాంక్ ఖాతాలు స్తంభింపజేశారు. 2021 నుంచి మత్తుబిళ్లలు విక్రయాలకు సంబంధించి 1,243 కేసులు నమోదయ్యాయని, 2,423 మందిని జైలుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. గంజాయిని పూర్తిస్థాయిలో అడ్డుకొనేందుకు జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ, ఏదో ఒక రూపంలో కొంత మంది ఈ చర్యలకు పాల్పడుతున్నారని, ఇలాంటి వారిని కఠినంగా శిక్షించాల్సి ఉందని ప్రజలు కోరుతున్నారు.

వండలూరు 'జూ'లో జంతువులకు షవర్‌బాత్



ఏనుగుకు స్నానం చేయిస్తున్న జూ సిబ్బంది

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎండవేడి అధికమవుతుండటంతో వండలూరు జంతు ప్రదర్శన శాలలోని జంతువులకు షవర్‌బాత్ నిర్వహిస్తున్నారు. ఎండకు సొమ్మసిల్లిపోకుండా జంతువులకు పుచ్చకాయలు, ఆరెంజ్, ఆపిల్ వంటి పండ్ల ముక్కలను కూడా అందిస్తున్నారు. ఈ జంతు ప్రదర్శనశాలలో రెండు వేలకు పైగా పక్షులు, జంతువులున్నాయి. ప్రస్తుతం పగటిపూట ఉష్ణోగ్రతలు అధికమవుతుండటంతో జంతు ప్రదర్శనశాలలోని జీవాలు వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఏనుగులు, పులులు, చిరుతలు, చింపాంజీలకు రోజుకు నాలుగైదు సార్లు షవర్‌బాత్‌లు చేయిస్తున్నారు. జంతు ప్రదర్శనశాలలోని నీటి గుంటల్లో తెల్లపులులు, చిరుతలు సేద దీరేందుకు అనువుగా ఏర్పాట్లు చేశారు. జింకలు నెమళ్లు, పక్షులు, అడవి దున్నల దాహార్తి తీర్చేలా వాటి ఎన్‌క్లోజర్ల వద్ద ప్రత్యేకంగా నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నారు. పక్షుల ఎన్‌క్లోజర్ వద్ద ఇనుపతీగలు కట్టి వాటిపై జనపనార సంచులు వేలాడదీసి తరచూ వాటిని నీటితో తడుపుతున్నారు. సింహాలు, పులుల కోసం పెద్ద పెద్ద నీటి గుంటలను కూడా తవ్వి, అందులో నీరు తగ్గకుండా చూస్తున్నారు. ఇక ఏనుగులకు రోజు రెండు మూడు సార్లు షవర్‌బాత్ చేస్తున్నారు. రోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గంటకొకసారి జంతు ప్రదర్శనశాలలోని జంతువులను పరిశీలించి వాటికి ఎండవేడి తగలకుండా సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇదే విధంగా అన్ని ఎన్‌క్లోజర్స్ వద్ద అటు జంతువులు, ఇటు వాటి సందర్శకులకు ఎండవేడి తగలకుండా పందిళ్లను కూడా ఏర్పాటు చేస్తున్నారు.



మడుగులో దాహం తీర్చుకుంటున్న నీటి ఏనుగులు

సమాచార దృష్టి

టీచర్లకు ట్యాబ్‌ల పంపిణీ

ఐసిఎఫ్, మార్చి 30: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పనిచేసే ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వ ఉన్నత, మహోన్నత పాఠశాలల్లో హైటెక్ ల్యాబ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. వీటి ద్వారా విద్యార్థులకు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇస్తున్నారు. అలాగే, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పాఠాలు బోధించేందుకు ట్యాబ్‌లు అందజేశారు.

2న ఆటిజం పిల్లల పాటకచ్చేరి

ఐసిఎఫ్, మార్చి 30: ఆటిజం బాధిత పిల్లల సంగీత కచ్చేరి ఏప్రిల్ 2వ తేది జరగనుంది. ప్రపంచ ఆటిజం అవగాహన దినం ఏప్రిల్ 2వ తేదీని పురస్కరించుకొని సూర్య స్కూల్ ఆఫ్ మ్యూజిక్ ఆధ్వర్యంలో కామరాజర్ రోడ్డులో ఉన్న లేడి వెల్లింగ్టన్ కళాశాల ఆడిటోరియంలో సాయంత్రం 4 నుంచి 9 గంటల వరకు సంగీత కార్యక్రమాలు జరగనున్నాయి. మాజీ ఎన్నికల కమిషనర్ కృష్ణమూర్తి ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు.

సెంట్రల్‌కు వచ్చే కొన్నిరైళ్లు ఆవడి, పెరంబూర్, బీచ్ స్టేషన్లకు మళ్లింపు

ప్యారీస్, మార్చి 30: మరమ్మతుల కారణంగా చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు కొన్ని ముఖ్యమైన ఎక్స్‌ప్రెస్ రైళ్లను తిరువళ్లూర్, ఆవడి, పెరంబూర్, బీచ్ రైల్వేస్టేషన్లలో నిలిపి వేయనున్నట్లు దక్షిణ రైల్వే శాఖ ప్రకటించింది. బెంగళూరు నుంచి సెంట్రల్‌కు వచ్చే సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, ఈరోడ్ నుంచి వచ్చే ఏర్కాడు సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లను ఏప్రిల్ 2వ తేది ఆవడిలో నిలిపివేస్తారు. అదే విధంగా కేరళ రాష్ట్రం అలపుళ నుంచి వచ్చే ఎక్స్‌ప్రెస్‌ను ఏప్రిల్ 2వ తేది తిరువళ్లూర్‌లో నిలుపుతారు. హౌరా ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 1వ తేది చెన్నై బీచ్ చేరుకుంటుంది. మరోమార్గంలో సెంట్రల్ నుంచి బెంగళూరు, ఈరోడ్‌కు ఏప్రిల్ 2వ తేది బయల్దేరే ఎక్స్‌ప్రెస్ రైళ్లు చెన్నై బీచ్ నుంచి నడుపుతారు. సెంట్రల్ నుంచి షాలిమార్‌కు నడిపే కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఏప్రిల్ 3న చెన్నై బీచ్ నుంచి బయల్దేరుతుంది. అలాగే, అలపుళ ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్, కొచ్చివెలి గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, ఇండోర్ కొచ్చివెలి ఎక్స్‌ప్రెస్‌లు ఏప్రిల్ 1, 2 తేదీల్లో సెంట్రల్ నుంచి కాకుండా బీచ్ స్టేషన్ నుంచి పెరంబూర్ మార్గంలో నడుస్తాయి.

వారసత్వ ధృవీకరణ పత్రం విధానాల్లో సవరణలు

ఐసిఎఫ్, మార్చి 30: వారసత్వ ధృవీకరణ పత్రాలు అందజేసే విధానాల్లో సవరణలు జరిగాయి. ఆస్తులు కలిగిన వ్యక్తులు మృతిచెందితే వారి వారసులు ఆస్తులు అనుభవించేందుకు ఈ సర్టిఫికెట్లు తప్పనిసరిగా పొందాలి. ప్రస్తుతం ఈ ధృవీకరణ పత్రాల పంపిణీలో చేపడుతున్న విధానాల్లో సవరణలు చేపట్టారు. భర్త మృతి చెందితే ఆయన భార్య, పిల్లలు, చట్టపరంగా దత్తత తీసుకున్న పిల్లలు వారసులవుతారు. మరో వివాహం చేసుకున్న వ్యక్తి మృతి చెందితే ఆ వ్యక్తి మరణించిన, విడాకులు పొందిన భార్యాపిల్లలు, ప్రస్తుతమున్న భార్యాపిల్లలు, దత్తత తీసుకున్న పిల్లలు వారసులుగా పరిగణిస్తారు. అవివాహితులు మరణిస్తే వారి తల్లిదండ్రులు, తోబుట్టువులు వారసులవుతారు. భర్త, భార్య, పిల్లలు మరణిస్తే దత్తత తీసుకున్న పిల్లలు, తల్లిదండ్రులు వారసులవుతారు. సంతానం లేని పక్షంలో భర్త, భార్య ఇరువురు మృతి చెందితే వారి తల్లిదండ్రులు, తోబుట్టువులు వారసులవుతారని రెవెన్యూ శాఖ అధికారులు తెలిపారు.

సెమిస్టర్ పరీక్షలు వాయిదా

పెరంబూర్, మార్చి 30: రంజాన్ పండుగ సందర్భంగా సెమిస్టర్ పరీక్షా తేదీల్లో మార్పులు చేసినట్లు సాంకేతిక విద్యాశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాలిటెక్నిక్ లల్లో ఈ నెల 10, 12 తేదీల్లో జరగాల్సిన సెమిస్టర్ పరీక్షలు, రంజాన్ పండుగ సందర్భంగా ఈ నెల 24, 25 తేదీలకు మార్చినట్లు సాంకేతిక విద్యాశాఖ తెలిపింది.

ముదుమలైలో కార్చిచ్చు

ఐసిఎఫ్, మార్చి 30: నీలగిరి జిల్లా ముదుమలై పులుల శరణాలయం మసినకుడి ప్రాంతంలో కార్చిచ్చు ఏర్పడిందని అటవీ శాఖ తెలిపింది. మసినకుడి సింగార ఆచికడై సమీపంలో శుక్రవారం సాయంత్రం చెలరేగిన మంటలు కొద్దిసేపట్లోనే కొన్ని ఎకరాల మేరకు వ్యాపించాయి. సమాచారం అందుకున్న గూడలూరు అగ్నిమాపక, అటవీ శాఖల సిబ్బంది మంటలు ఆర్పే పనులు చేపట్టారు.

నెలరోజుల్లో 8,673 మంది చికిత్స

ఐసిఎఫ్, మార్చి 30: స్థానిక గిండిలో కొత్తగా ప్రారంభించిన జాతీయ వృద్ధుల సంక్షేమ ఆసుపత్రిలో నెలరోజుల్లో 8,673 మంది చికిత్స పొందారు. ఫిబ్రవరి 25వ తేది ప్రారంభించిన ఈ ఆసుపత్రిలో 60 మంది వైద్యులు, 10 మంది వైద్యనిపుణులు, 216 మంది నర్సులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ఆసుపత్రి ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 8,673 మంది చికిత్స పొందారని, ఇన్ పేషంట్లుగా 261 మంది చికిత్స పొందుతున్నారని, అత్యవసర చికిత్సా విభాగంలో 101 మంది, ఛార్జీ వార్డుల్లో 22 మంది చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో 21,000 రౌడీలు

ఐసిఎఫ్, మార్చి 30: లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో రాష్ట్రంలో 21,000 రౌడీలపై పోలీసులు నిఘా వేశారు. ఈ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించేలా ఎన్నికల కమిషన్ చర్యలు చేపట్టింది. పోలింగ్ రోజున రౌడీలు, సంఘ విద్రోహుల చర్యల్ని అడ్డుకొనేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను నియమించినట్లు రాష్ట్ర డీజీపీ శంకర్ జివాల్ తెలిపారు. ఏ, ఏ ప్లస్, బి, సి అని నాలుగు రకాలుగా రౌడీలను విభజించి జాబితా తయారు చేశారు.

దుకాణాల రెన్యువల్ గడువు పెంపు

పెరంబూర్, మార్చి 30: దుకాణాల లైసెన్స్ రెన్యువల్ గడువును పొడిగించినట్టు ఈ గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పేర్కొంది. జీసీసీ పరిధిలోని దుకాణాలు, వ్యాపార సంస్థలు తమ లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాల్సి ఉంది. గడువు ఈ నెల 31వ తేదీతో ముగియనున్న నేపథ్యంలో, వ్యాపారుల కోరిక మేరకు ఏప్రిల్ 30వ తేది వరకు పొడిగించినట్లు జీసీసీ పేర్కొంది.

ఐటీ దాడులను రాజకీయంగా చూడొద్దు: వానతి

పెరంబూర్, మార్చి 30: దర్యాప్తు సంస్థలు చేపట్టే చర్యలు రాజకీయ కోణంలో చూడరాదని బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ తెలిపారు. కన్నియాకుమారి లోక్‌సభ నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి పొన్.రాధాకృష్ణన్‌కు మద్దతుగా శనివారం ప్రచారం చేపట్టిన ఆమె విలేఖరులతో మాట్లాడుతూ... పలు పార్టీలు గుర్తులు పొందేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకుండా నిద్రపోయి, అవి లభించకపోవడంతో తమపై ఆరోపణలు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. దర్యాప్తు సంస్థలు చేపట్టే చర్యలను రాజకీయంగా చూస్తే తప్పు చేసిన వారు శిక్ష పడకుండా తప్పించుకొనే అవకాశముందని వానతి అభిప్రాయం వ్యక్తం చేశారు.

ఉత్తరాదిలోనూ ద్రావిడ తరహా పాలన

● సేలం సభలో సీఎం స్టాలిన్ ధ్వజం




అశేష జనవాహిని నడుమ సేలం సభలో ప్రసంగిస్తున్న సీఎం స్టాలిన్

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల తర్వాత ఉత్తరాదిలోనూ ద్రావిడ తరహా పాలన ఏర్పాటవుతుందని డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ అన్నారు. సేలంలో శనివారం సాయంత్రం సేలం, కళ్లకురిచ్చి డీఎంకే అభ్యర్థులు సెల్వగణపతి మలైయరసన్‌కు మద్దతుగా ఏర్పాటైన సభలో ప్రసంగిస్తూ... గత అసెంబ్లీ ఎన్నికల్లో దక్షిణాదిన ఆవిర్భవించిన ద్రావిడ తరహా పాలన త్వరలోనే ఉత్తరాదిలోనూ వస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న ప్రభుత్వంగా డీఎంకే పేరు తెచ్చుకుంటుండగా, కేంద్రంలోని బీజేపీ ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందిగా కీర్తి గడించిందని ఎద్దేవా చేశారు. పదేళ్లుగా పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలను విపరీతంగా పెంచిన ప్రధాని ఈ లోక్‌సభ ఎన్నికలు సమీపించగానే వాటి ధరలను కాస్త తగ్గించడం గర్హనీయమన్నారు. ఎన్నికల బాండ్ల అవినీతి వెలుగులోకి రాగానే బీజేపీ నేతలకు ప్రత్యేకించి ప్రధాని మోదీకి నిద్రలేకుండా పోయిందన్నారు. ఎన్నికల్లో బీజేపీ కూటమి ఓటమి పాలవుతుందని ఇంటెలిజెన్స్ రిపోర్టులు చెబుతుండటంతో మోదీకి ఎక్కడా లేని భయం పట్టుకుందని, కనుకనే తమిళనాట తరచూ పర్యటించి ఓట్లు దండుకోవాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలోనే మోదీకి తమిళ మాజీ ముఖ్యమంత్రులు ఎంజీఆర్, జయలలిత గుర్తుకు వస్తారని, అదే సమయంలో తమిళభాషపై ఎనలేని ప్రేమ కూడా పుట్టుకువస్తుందని ఎద్దేవా చేశారు. ఈ సభలో రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, ఈవీ వేలు ముస్వేందర్ మున్నేట్ర కళగం నాయకుడు శ్రీధర్ వాండయార్, ఎంపీ పార్తిబన్, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కేవీ తంగబాలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందూ కాలేజీ 47వ స్నాతకోత్సవం



మొదటి శ్రేణి విద్యార్థులతో అతిథులు, అధ్యాపకులు

అడయార్, మార్చి 30: నగర శివారు ప్రాంతమైన పట్టాభిరాంలో ఉన్న డీఆర్‌బీసీసీసీ హిందూ కాలేజీ 47వ స్నాతకోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో పూర్వ ఉపసంచాలకుడు అశోక్ వర్ధన్ శెట్టి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 'నేర్చింది గుప్పెడంత నేర్వాల్సింది సముద్రమంత' అన్నట్టుగా ఎవరు నిత్యం చదువరిగా ఉంటారో వారే జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారన్నారు. చాలా మంది అనేకం మాట్లాడుతారని, కానీ బాధ్యతా రాహిత్యంగా ఉంటారన్నారు. ఇంకొందరు తక్కువగా మాట్లాడుతారని, అంకితభావంతో ఉంటారన్నారు. యువత ఎల్ల వేళలా కొత్త ఆలోచనలు చేయాలన్నారు. తద్వారా తమలోని సృజనాత్మకతను వెలికి తీసి ప్రత్యేకతను నిరూపించుకోవాలన్నారు. మనం చేసే పనుల్లో చిన్న చిన్న పొరపాట్లు జరుగుతుంటాయని, వాటిని సరిదిద్దుకుంటూ ముందుకు సాగాలన్నారు. ఉపాధి అవకాశాల కోసం కనీస డిగ్రీని విద్యార్హతగా పెట్టుకోవాలన్నారు. అలాగే, కాలేజీ స్థాయిలో జరిగే ఇతర పోటీల్లో పాల్గొని సర్టిఫికెట్లు పొందాలన్నారు. వ్యక్తిత్వ వికాసాన్ని కలిగి ఉండాలని సూచించారు. ఈ స్నాతకోత్సవంలో వివిధ శాఖలకు చెందిన 368 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలను అందుకున్నారు. వీరిలో 8 మంది విశ్వవిద్యాలయం స్థాయిలో మొదటి శ్రేణి పొందారు. వీరికి కాలేజీ యాజమాన్యం నగదు బహుమతితో పాటు బహుమతులను ప్రదానం చేసింది. ఈ కార్యక్రమానికి కాలేజీ కార్యదర్శి వెంకటేశ పెరుమాళ్ అధ్యక్షత వహించారు. ప్రధాన అధ్యాపకులు డాక్టర్ కల్విక్కరసి స్వాగతోపన్యాసం చేశారు. కళాశాల కార్యవర్గ సభ్యుడు గౌతమ్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొని స్నాతకోత్సవాన్ని జయప్రదం చేశారు.

ఘనంగా జీసెస్ డిసిపుల్స్ ఫెలోషిప్ వార్షికోత్సవం

108 మంది దివ్యాంగులకు ఈస్టర్ కానుక



ఫెలోషిప్ నిర్వాహకులకు జ్ఞాపికలు అందిస్తున్న ఫాదర్ జాన్ సుధాకర్, పోతల ప్రభుదాస్

ప్యారీస్, మార్చి 30: నగరానికి చెందిన జీసెస్ డిసిపుల్స్ ఫెలోషిప్ 7వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించి, 108 మంది దివ్యాంగులకు ఈస్టర్ కానుకగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కొరుక్కుపేట సమీపంలోని కార్నేశన్ నగర్‌లో ఉన్న డేనియేల్ పాఠశాల ప్రాంగణంలో ఫెలోషిప్ సభ్యులు అరుణకుమారి, భారతి, కె.జ్యోతి, రెబెకా, ఐ.జ్యోతి, రజిని, ప్రతిభ, ప్రమీల, డెబోరా, శాంతికుమారి, మేరి, సరోజ, విజయకుమారి ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 108 మంది దివ్యాంగులకు ఈస్టర్ పర్వదినాన్ని పురస్కరించుకుని వారికి నెలకు సరిపడా కిరాణా సరుకులు అందించారు. ముఖ్యఅతిథిగా డేనియేల్ పాఠశాల అధినేత డీఎస్ సౌందర పాండ్యన్, గౌరవ అతిథులుగా ఫాదర్ జాన్ సుధాకర్, క్రిస్టినా జయంతి... సమాజసేవలో రాణిస్తున్న ఫెలోషిప్ నిర్వాహకులను అభినందించారు. అంకితభావంతో సమాజానికి సేవలందిస్తున్న ఫెలోషిప్ నిర్వాహకులకు ఆత్మీయ అతిథి, మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ సంఘ కార్యదర్శి పోతల ప్రభుదాస్ జ్ఞాపికలు ప్రదానం చేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ట్రస్ట్, చారిటీ, ఏ సంస్థతో సంబంధాలు లేకుండా నగరంలో పలు ప్రాంతాల్లో నివసిస్తున్న తెలుగు క్రైస్తవ కుటుంబాలకు చెందిన 13 మంది మహిళామణులు తమ కుటుంబాలను పోషించుకుంటూ సమాజానికి తమ వంతు సేవ చేయాలన్న తలంపుతో ప్రారంభించిన ఫెలోషిప్ ద్వారా దివ్యాంగులకు సాయం చేయడం ప్రశంసనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా 300 మందికి అన్నదానం చేశారు.

పేద విద్యార్థులకు విద్యాదానం

● ఎంఎంఎస్ ఆధ్వర్యంలో రూ.16 కోట్ల ఆస్తి మార్పిడి

అడయార్, మార్చి 30: కృష్ణగిరి జిల్లా హోసూరుకు సమీపంలో ఉన్న రూరల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ పరిధిలోని మొత్తకొండపల్లి మోడల్ స్కూల్ (ఎంఎంఎస్) పలువురు పేద విద్యార్థులకు విద్యాదానం చేస్తోంది. 1999లో నెదర్లాండ్స్‌కు చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ టీడీహెచ్-ఎన్ ఇచ్చిన రూ.90 కోట్ల విరాళంతో ఈ పాఠశాలను స్థాపించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు అనేక వందలమంది విద్యార్థులకు విద్యాదానం చేశారు. ఈ స్కూల్‌లో 500మందికిపైగా విద్యార్థులు ఉచిత విద్యను అభ్యసిస్తున్నారు. అయితే, ఈ పాఠశాలకు చెందిన రూ.16 కోట్ల విలువైన ఆస్తిని మరో వ్యక్తి పేరుకు అక్రమంగా బదిలీ చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ అంశంపై ఐఏఎస్ అధికారి దినేష్‌కు ఓ పత్రికా విలేఖరి ఫిర్యాదు చేశారు. అలాగే, ఈ స్కూల్‌కు కొత్త కార్యదర్శిని నియమించాలని ఆయన కోరారు.

అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు



అభ్యర్థులకు గుర్తులు కేటాయిస్తున్న కలెక్టర్

వేలూరు, మార్చి 30: స్థానిక కలెక్టర్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పలు పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు. ఈ విషయమై ఎన్నికల అధికారి సుబ్బులక్ష్మి మాట్లాడుతూ... వేలూరు పార్లమెంటు నియోజకవర్గంలో మొత్తం 31 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, వారిలో పులిగళ్ జననాయగ పార్టీ అభ్యర్థి, నటుడు మన్సూర్ అలీఖాన్‌కు పనస పండు కేటాయించినట్లు తెలిపారు.

ఆటోలపై ఓటు అవగాహన స్టిక్కర్లు



ఆటోలకు స్టిక్కర్లు అంటిస్తున్న కార్పొరేషన్ కమిషనర్ జానకి

వేలూరు, మార్చి 30: కేంద్ర ఎన్నికల సంఘం ఉత్తర్వులతో జిల్లా ఎన్నికల అధికారి సుబ్బులక్ష్మి సూచనలతో వేలూరు కార్పొరేషన్ కమిషనర్ జానకి నగరంలో ఓటు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. అందులో భాగంగా 100 శాతం ఓటింగ్ నమోదు, న్యాయంగా ఓటు వేస్తాం అనే వాఖ్యాలతో కూడిన స్టిక్కర్లను ఆటోలకు అంటించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఆరోగ్యశాఖ అధికారి శివకుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కోలాహలంగా హీలియస్ పాఠశాల వార్షికోత్సవం



బహుమతుల పంపిణీలో నిర్వాహకులు, అతిథులు

వేలూరు, మార్చి 30: స్థానిక కాట్పాడి ముత్తమిళ్ నగర్‌లో ఉన్న హీలియస్ పిల్లల ఆటల పాఠశాల 8వ వార్షికోత్సవాలు కోలాహలంగా జరిగాయి. వేడుకలకు ముఖ్యఅతిథిగా కాట్పాడి రెడ్‌క్రాస్ సంఘం అవై అధ్యక్షుడు జనార్ధనన్ పాల్గొని, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. వేడుకలకు భారత ప్రభుత్వ శాస్త్రవేత్త ఎన్ఎస్ మణికంఠన్ అధ్యక్షత వహించగా, మాజీ అటవీ అధికారి వాసుదేవన్, హరిదాస్, మాజీ ప్రధానోపాధ్యాయులు మణిమేఘలై తదితరులు పాల్గొన్నారు.

కళా జాతాల ద్వారా అవగాహన




సాంస్కృతిక ప్రదర్శనలో కళాకారులు

వేలూరు, మార్చి 30: జిల్లాలో 100 శాతం ఓటింగ్ నమోదయ్యేలా జిల్లా యంత్రాంగం ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఫ్లెక్సీలు, కరపత్రాలు, మారథాన్ పోటీలు, బస్సులు, ఆటోలకు స్టిక్కర్లు అంటిస్తూ అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ అవగాహన ప్రచారంలో భాగంగా గుడియాత్తం డివిజన్ పొక్కం పంచాయతీలో కళాజాతా నిర్వహించారు. ఈ ప్రచార కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి సుబ్బులక్ష్మి ప్రారంభించగా, జిల్లా అడిషినల్ రెవెన్యూ అధికారి మాలతి, మహిళ పథక అధికారి నాగరాజన్, అసిస్టెంట్ ఎన్నికల అధికారులు శుభలక్ష్మి (గుడియాత్తం), సుమతి (కేవీ కుప్పం), జిల్లా ఆదిద్రావిడుల సంక్షేమ శాఖ అధికారి రామచంద్రన్, తహసీల్దార్ చిత్రాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా స్వయం సహాయక బృందాలు ఓటు హక్కు ప్రాధాన్యం తెలుపుతూ వేసిన రంగవల్లికలను ఎన్నికల అధికారి సుబ్బలక్ష్మి వీక్షించారు.

1,700 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం



పేర్నాంబట్టు సమీపంలో అధికారులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

వేలూరు, మార్చి 30: పేర్నాంబట్టు సమీపంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు కలెక్టర్ సుబ్బులక్ష్మికి సమాచారం అందింది. ఆమె ఉత్తర్వులతో శనివారం తెల్లవారుజామున వేలూరు ఆహార భద్రతా శాఖ ఇన్‌స్పెక్టర్ ఇంద్రాణి పేర్నాంబట్టు సమీపంలో తనిఖీలు చేపట్టారు. పార్కు వీధి సమీపంలోని చెరువు తీరంలో ఉన్న ప్రహరీ సమీపంలో తనిఖీలు చేపట్టి 50 కిలోల బరువున్న 28 బస్తాల్లో మొత్తం 1,400 కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే, కుప్పైమేడు ప్రాంతాల్లో 8 బస్తాల్లో ఉంచిన 300 కిలోల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు ఘటనల్లో రేషన్ బియ్యాన్ని ఎవరు తరలిస్తున్నారంటూ అధికారులు విచారణ చేపట్టారు.

ఆవలూరు పంచశక్తిపీఠంలో సరస్వతి పూజలు



చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆవలూరులోని శ్రీ ఓం పంచశక్తి పీఠంలో వసంత నవరాత్రి సందర్భంగా మహా సరస్వతి పూజలు ఈ నెల 28న ప్రారంభమయ్యాయి. మణితటాకం సమీపంలో మహాసరస్వతి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పీఠాధిపతి జ్ఞానసత్యేంద్రస్వామి ఆధ్వర్యంలో పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆదివారం వరకూ ఈ పూజలు కొనసాగుతాయి.

విదేశీ మద్యం బాటిళ్ల స్వాధీనం



పెరంబూర్, మార్చి 30: స్థానిక బర్మా బజార్‌లో 655 విదేశీ మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్యారీస్ సమీపంలోని బర్మా బజార్‌లో కొన్ని దుకాణాల్లో విదేశీ మద్యం విక్రయిస్తున్నట్లు ఫ్లవర్ బజార్ ఎక్సైజ్ పోలీసులకు అందిన సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఈ ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని, మాధవరం సేలైవాయల్‌కు చెందిన కల్యాణరామన్, కొడుంగైయూర్ తిరువళ్లువర్ నగర్‌కు చెందిన నాగనాథన్‌ను అరెస్ట్ చేసి, శనివారం కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

నీటమునిగి నలుగురు మహిళల మృతి



నది నుంచి వెలికి తీసిన మృతదేహాలు

వేలూరు, మార్చి 30: ఆలయ దర్శనానికి వెళ్లి వస్తున్న వారిని మృత్యువు కబళించింది. మార్గమధ్యంలో నదిలో స్నానం చేస్తున్న నలుగురు మహిళలు నీటమునిగి మృతి చెందిన ఘటన వేలూరు జిల్లాలో శనివారం సాయంత్రం జరిగింది. గుడియాత్తం సమీపం వేప్పూర్ తంగానికి చెందిన నలుగురు మహిళలు కొండ ప్రాంతంలో ఉన్న తమ కులదైవం మునీశ్వరన్ ఆలయానికి శనివారం ఉదయం వెళ్లారు. దైవదర్శనం అనంతరం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో నలుగురు సమీపంలోని నదిలో స్నానాలకు దిగారు. ఊహించని విధంగా లోతైన ప్రాంతానికి వెళ్లిన వారు ఒకరి తర్వాత ఒకరు నీటమునిగారు. వీరు నదిలో మునిగిపోవడాన్ని గమనించిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు అగ్నిమాపక సిబ్బందితో అక్కడకు చేరుకున్న పోలీసులు నదిలో గాలించి నలుగురు మృతదేహాలు వెలికితీశారు. ప్రాథమిక సమాచారం మేరకు మృతులు సరోజు, ఆమె కుమార్తె లలిత, సోదరీమణులు ఖాజియా, ప్రీతి అని తెలిసింది.

హారతి పట్టిన మహిళకు రూ.2 వేల కానుక

● సోషల్ మీడియాలో వీడియో వైరల్



నగదు కానుక అందిస్తున్న ఓపీఎస్

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎన్డీయే తరపున రామ నాథపురంలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్ సెల్వం (ఓపీఎస్) కొత్త వివాదంలో చిక్కు కున్నారు. పుదుకోట జిల్లా అరంతాంగి ప్రాంతంలో ఎన్డీయే అభ్యర్థులకు మద్దతుగా ఆయన ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఓపీఎస్‌కు ఓ మహిళ హారతి పట్టారు. వెంటనే ఆయన తన జేబు నుంచి నాలుగు రూ.500 నోట్లను హారతి పట్టిన మహిళ చేతికి అందించారు. ఈ దృశ్యంతో కూడిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. ఓపీఎస్ ఇలా హారతి పట్టిన మహిళకు రూ.2వేలు కానుకగా ఇవ్వడం ఎన్నికల నిబంధనల ఉల్లంఘనే అవుతుందని నెటిజన్లు, ప్రత్యర్థి పార్టీలకు చెందిన నేతలు ఆరోపిస్తున్నారు.

ఈరోడ్ ఎంపీ స్థానం పోలింగ్ కోసం మూడు పోలింగ్ యంత్రాలు

అడయార్, మార్చి 30: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఈరోడ్ స్థానం పోలింగ్ కోసం మూడు ఈవీఎంలను ఉపయోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ స్థానం నుంచి మొత్తం 37 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. దీంతో మూడు ఈవీఎంలను ఉపయోగించాల్సి ఉంటుందని ఎన్నికల అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు 37 మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా, వీరిలో ఒక్కరు కూడా నామినేషన్ విత్‌డ్రా చేసుకోలేదు. ఒక ఈవీఎంలో 16 మంది అభ్యర్థుల పేర్లతో ఒక నోటా బటన్ మాత్రమే లోడింగ్ చేసేందుకు అవకాశం ఉంటుంది. అంతకుమించి అభ్యర్థులు పోటీలో ఉంటే అదనపు ఈవీఎంలను వినియోగించాల్సి ఉంది. ఈమేరకు ఈరోడ్ స్థానంలో 37 మంది బరిలో నిలిస్తే 3 ఈవీఎంలను ఉపయోగించేలా అధికారులు చర్యలు చేపట్టారు.

ప్రధాని అభ్యర్థులుగా రాహుల్, ప్రియాంక

● మన్సూర్ అలీఖాన్

అడయార్, మార్చి 30: ప్రధానమంత్రి అభ్యర్థులుగా తమ పార్టీ తరపున కాంగ్రెస్ నేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ పేర్లను ప్రతిపాదిస్తున్నట్టు ఇండియా జననాయగ పులిగల్ కట్చి అధ్యక్షుడు, సినీ నటుడు మన్సూర్ అలీఖాన్ తెలిపారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఆయన స్వతంత్ర అభ్యర్థిగా వేలూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దేశం అన్ని రంగాల్లో వృద్ధి చెందిందని భారతీయ జనతా పార్టీ నేతలు చేస్తున్న ప్రచారం ఈ శతాబ్దపు జోక్ అని అన్నారు. దేశంలో 2 కోట్ల మందికి ఉపాధి అవకాశాల కల్పించినట్టు చేస్తున్న ప్రచారంలో కూడా ఏమాత్రం నిజం లేదన్నారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందన్నారు. దేశ ఆర్థిక స్థితిగతులపై ప్రసంగించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలైకు సవాల్ విసురుతున్నానన్నారు.

పొల్లాచ్చి బీజేపీ అభ్యర్థిపై కేసు నమోదు

పెరంబూర్, మార్చి 30: పొల్లాచ్చి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వసంతరాజన్ సహా 10 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. కోనవాయిక్కాల్ ప్రాంతంలో అనుమతులకు మించి పెద్దసంఖ్యలో వాహనాలతో బీజేపీ అభ్యర్థి ప్రచారం చేపట్టినట్లు ఫిర్యాదులందాయి. ఈ వ్యవహారంపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి ఫిర్యాదుతో బీజేపీ అభ్యర్థి సహా 10 మందిపై బోతనూరు పోలీసులు కేసు నమోదు చేశారు.



వేలూరు లోక్‌సభ నియోజకవర్గంలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాన్ని శనివారం పరిశీలిస్తున్న ఎన్నికల జనరల్ సూపర్‌వైజర్ రూపేష్‌కుమార్, ఉప ఎన్నికల అధికారి కవిత, వేలూరు తహసీల్దార్ గోపి తదితరులు

ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపు

పెరంబూర్, మార్చి 30: నగరంలోని మరో ప్రైవేటు పాఠశాలకు బాంబు బెదిరింపు మెసేజ్ కలకలం రేపింది. రాజా అన్నామలైపురంలోని ప్రైవేటు పాఠశాలకు శనివారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. ఈ విషయాన్ని పాఠశాల నిర్వాహకులు పట్టిణంబాక్కం పోలీసులకు తెలియజేశారు. బాంబ్ స్క్వాడ్‌తో అక్కడకు చేరుకున్న పోలీసులు, పాఠశాల గదులు, ప్రాంగణాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, బాంబు బెదిరింపు ఫేక్ మెసేజ్ అని నిర్ధారించి, ఈ-మెయిల్ పంపిన చిరునామా కోసం విచారిస్తున్నారు.

ఎంవీ డయాబెటీస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో పాద సంరక్షణపై శిక్షణ



చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపురంలోని ఎంవీ హాస్పిటల్ ఫర్ డయాబెటీస్ అండ్ ప్రొఫెసర్ ఎం.విశ్వనాథన్ డయాబెటీస్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో గిండీలోని ఓ హోటల్‌లో శనివారం ఉదయం ఎం.విశ్వనాథన్ గోల్డ్‌మెడల్ స్మారకోపన్యాస కార్యక్రమం ఏర్పాటైంది. ఈ సందర్భంగా మధుమేహం వల్ల వచ్చే పాదాల గాయాలకు అందించే చికిత్సలపై శిక్షణ కార్యక్రమాన్ని కేరళ హైకోర్టు న్యాయమూర్తి గోపీనాథ్ ప్రారంభించారు. 'వైద్యుల నుంచి సమాజం ఆశిస్తున్నదేమిటి?' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సభలోనే మధుమేహ రోగులకు విశిష్ట వైద్యసేవలందించిన డాక్టర్ డేవిడ్ ఆర్మ్‌స్ట్రాంగ్‌కు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంవీ డయాబెటీస్ ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ విజయ్ విశ్వనాథన్, సంస్థ అసోసియేట్ డీన్ డాక్టర్ జయశ్రీగోపాల్, డాక్టర్ ఎస్ఎస్ నరసింహన్ తదితరులు పాల్గొన్నారు.

● మూలిగే నక్కపై...!

ఎన్నికల ప్రచారానికి ఐపీఎల్ సెగ



పెరంబూర్, మార్చి 30: తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని 40 లోక్‌సభ స్థానాలకు ఏప్రిల్ 19వ తేది ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. ప్రస్తుతం నామినేషన్ ప్రక్రియ ముగియడంతో అన్ని పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేపడుతున్నాయి. కానీ, ప్రస్తుతం జరుగుతున్న ఐపీఎల్ క్రికెట్ మ్యాచ్‌లతో అభ్యర్థులు ఖంగుతింటున్నారు. క్రికెట్ మ్యాచ్‌లు ప్రతిరోజూ రాత్రి 7.30 గంటలకు ప్రారంభమవుతుండడంతో కార్యకర్తలు ప్రచారానికి డుమ్మా కొట్టి క్రికెట్ పోటీలు చూడడంలో మునిగిపోతున్నారు. అలాగే, వీధి ప్రచారం చేపట్టే సమయంలోనూ ప్రజలు బయట కనిపించక పోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. ఇక, శని, ఆదివారాల్లో రెండు మ్యాచ్ జరుగుతుండగా, మొదటి మ్యాచ్ సాయంత్రం 4 గంటల నుంచే ప్రారంభమవుతుండడంతో కార్యకర్తలు ప్రచారానికి రావడం లేదు. దీంతో, అటు నేతలు, అభ్యర్థులు ఖంగుతింటున్నారు.



గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఎన్నికల విభాగ సిబ్బంది శనివారం ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఇంటింటికీ వెళ్లి 'నా ఓటు... నా హక్కు' అంటూ ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

తిరువళ్లూర్‌ను తిప్పేసేదెవరో?



శశికాంత్ సెంథిల్ (కాంగ్రెస్) - పాన్ వి.పాల్‌గణపతి (బీజేపీ) - నల్లతంబి (డీఎండీకే)



తిరువళ్లూర్ (రిజర్వుడు) లోక్‌సభ నియోజకవర్గం రాజధాని నగరం చెన్నైకి సమీపంలో ఉంది. వ్యవసాయం, పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన నియోజకవర్గంగా పేరుగాంచింది. 2009లో శ్రీపెరుంబుదూర్ నియోజకవర్గంలో భాగంగా ఉండగా, పునర్విభజన అనంతరం తిరువళ్లూర్ (రి) నియోజకవర్గంగా మారింది.

\- పెరంబూర్

మొత్తం ఓటర్లు:	20,58,098
పురుషులు:	10,10,968
మహిళలు:	10,46,755
ఇతరులు:	375

అసెంబ్లీ నియోజకవర్గాలు...

తిరువళ్లూర్ లోక్‌సభ నియోజకవర్గంలో గుమ్మిడిపూండి, పొన్నేరి (రిజర్వుడు), పూందమల్లి (రిజర్వుడు), తిరువళ్లూర్, ఆవడి, మాధవరం తదితర ఆరు నియోజకవర్గాలున్నాయి. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో గుమ్మిడిపూండి, తిరువళ్లూర్, ఆవడి, పూందమల్లి, మాధవరం నియోజకవర్గాల్లో డీఎంకే, పొన్నేరిలో కాంగ్రెస్ విజయం సాధించాయి.

2014లో అత్యధిక మెజార్టీతో అన్నాడీఎంకే....

2014 లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే తరఫున పోటీ చేసిన పి.వేణుగోపాల్ 6,28,499 ఓట్లు సాధించగా, ఆయన ప్రత్యర్థి, డీఎంకే కూటమి తరఫున పోటీ చేసిన డీపీఐ అభ్యర్థి రవికుమార్‌కు 3,50,069 ఓట్లు దక్కాయి. దీంతో, వేణుగోపాల్ 3,23,430 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. రాష్ట్రంలో ఆ ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజార్టీతో సాధించిన వ్యక్తిగా వేణుగోపాల్ నిలిచారు.

2019లో...

2019లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి తరఫున పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి కె.విజయకుమార్ 7,67,292ఓట్లు సాధించి విజయం సాధించారు.ఆయన ప్రత్యర్థి అన్నాడీఎంకే అభ్యర్థి వేణుగోపాల్ 4,10,337 ఓట్లతో రెండో స్థానంలో నిలిచారు. ఇక, మక్కల్ నీది మయ్యం 73,731 ఓట్లు, నామ్ తమిళర్ పార్టీ 65,416, ఏఎంఎంకేలు 33,944 ఓట్లు సాధించాయి.

కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ...

రాష్ట్రంలో కాంగ్రెస్ - బీజేపీ నేరుగా తలపడనున్న స్థానాల్లో తిరువళ్లూర్ లోక్‌సభ నియోజకవర్గం ఒకటి. సీట్ల సర్దుబాటులో భాగంగా డీఎంకే కూటమిలో ఈ స్థానాన్ని కాంగ్రెస్‌కు కేటాయించారు. తొలుత ఈ స్థానం నుంచి తామే పోటీ చేస్తామని భావించిన డీఎంకే కార్యకర్తల్లో కాస్త అసంతృప్తి నెలకొంది. ప్రస్తుతం ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ, డీఎండీకే, నామ్ తమిళర్ పార్టీ, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థులు బరిలో నిలిచారు. ఈ సారి బరిలో అందరూ కొత్తవారు కావడం విశేషం. కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఐఏఎస్ అధికారి శశికాంత్ సెంథిల్ పోటీచేస్తున్నారు. ఆయన ఇటీవల కర్ణాటకలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇన్‌చార్జీగా వ్యవహరించడం, అక్కడ కాంగ్రెస్ అధికారం చేపట్టడంలో ఆయన పాత్ర ఉందని పార్టీ భావిస్తోంది. ఇక, బీజేపీ అభ్యర్థిగా పొన్ వి.పాల్ గణపతి, అన్నాడీఎంకే కూటమిలో డీఎండీకే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నల్లతంబి, ఎన్టీకే అభ్యర్థిగా ఇంజనీర్ జగదీశ్‌చందర్ బరిలో నిలిచారు.

ప్రధాన సమస్యలు...: ● ఈ నియోజకవర్గ పరిధిలోని వేపంబట్టు రైల్వే ఫ్లై ఓవర్, సెవ్వాపేట రైల్వే ఫ్లై ఓవర్, పట్టాభిరాం మిలిటరీ సైడింగ్ రైల్వే ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు ఇంకా పూర్తికాకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

- తిరువళ్లూర్ నగరంలో భూగర్భ డ్రైనేజీ పనుల్లో జాప్యం జరుగుతోంది. అలాగే, తిరునిండ్రవూర్ మున్సిపాలిటీ, ఆవడి కార్పొరేషన్ పరిధిలోనూ భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.
- తిరువళ్లువర్ నగరంలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడడంతో వాహనచోదకులు, ప్రజలకు ఇబ్బంది తప్పడం లేదు. - ఇక, తిరువళ్లూర్‌లో ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఏర్పాటు దీర్ఘకాలంగా ఎన్నికల సమయంలో హామీ ఇస్తున్న పార్టీలు, ఎన్నికల అనంతరం పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.
- కరోనా లాక్‌డౌన్ సమయంలో సబర్బన్ రైళ్ల సర్వీసులు రద్దయ్యాయి. అనంతరం కరోనా అదుపులోకి వచ్చి రైళ్లు యధావిధిగా నడుస్తున్నా రాత్రి వేళ నడిచే రైళ్లు పునరుద్ధరించలేదు. మూర్‌మార్కెట్ నుంచి గుమ్మిడిపూండికి అర్ధరాత్రి 12.15, చెన్నై బీచ్ నుంచి వేకువజామున 1.15 గంటలకు అరక్కోణం వెళ్లే రైలు సర్వీసులు ఇంకా పునరుద్ధరించలేదు.
- రాజధాని నగరానికి సమీపంలో ఉన్నా ఈ నియోజకవర్గం ఇంకా అభివృద్ధికి నోచుకోలేదు.

అన్ని వర్గాల సమాహారం...

తిరువళ్లూర్ లోక్‌సభ నియోజకవర్గంలో అధిక శాతం వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఈ నియోజకవర్గంలో కూవం, ఆరణి, కొశస్థలి అనే మూడు నదులున్నాయి. కూవం నది ప్రారంభమయ్యే ప్రాంతంగా తిరువళ్లూర్ నిలిచింది. కాకలూరు, గుమ్మిడిపూండి, కాట్టూరు తదితర ప్రాంతాల్లో కర్మాగారాలు అధికంగా ఉన్నాయి. ఇక్కడ హిందువులు అధికంగా ఉన్నారు. అలాగే, క్రైస్తవులు, ముస్లింలున్నారు. అలాగే, ఆదిద్రావిడులు అధికంగా ఉండగా వన్నియర్లు, ముదలియార్, నాడార్లు అని అన్ని వర్గాల సమాహారంగా ఉన్న ఈ నియోజకవర్గ ప్రజలు ఎవరిని తమ ప్రతినిధిగా ఎంచుకోనున్నారని అనే విషయం జూన్ 4వ తేదీ వరకు వేచి చూడాల్సి ఉంది.



మరియా జెన్నిఫర్, విజయవసంత్, పొన్‌రాధాకృష్ణన్

కన్నియాకుమారిలో కోటీశ్వరుల మధ్యే పోటీ

● హేమాహేమీలు

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి లోక్‌సభ నియోజకవర్గంలో నలుగురు కోటీశ్వరులు పోటీ చేస్తున్నారు. ఆ నియోజకవర్గంలో డీఎంకే కూటమి తరఫు కాంగ్రెస్ అభ్యర్థి విజయవసంత్, బీజేపీ కూటమి తరఫున పొన్ రాధాకృష్ణన్, ఎన్టీకే తరఫున మరియా జెన్నిఫర్, అన్నాడీఎంకే కూటమి తరఫున పసిలియాన్ నజరతే పోటీ చేస్తున్నారు. నామినేషన్లతోపాటు సమర్పించిన ఆస్తుల జాబితా ప్రకారం ఈ నలుగురు కోటీశ్వరులు. బీజేపీ అభ్యర్థి రాధాకృష్ణన్‌కు రూ.64.03 లక్షల విలువైన చరాస్తులు, రూ. 6.99 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. అన్నాడీఎంకే అభ్యర్థి నజరతేకు రూ.3.34 కోట్ల చరాస్తులు, రూ.4.82 కోట్ల స్థిరాస్తులు ఉన్నాయి. ఎన్టీకే అభ్యర్థి మరియా జెన్నిఫర్‌కు రూ.2.41కోట్ల చరాస్తులు, రూ.2.13 కోట్ల స్థిరాస్తులున్నాయి. ఇక కాంగ్రెస్ అభ్యర్థి విజయ వసంత్‌కు రూ.61.90 కోట్లకు పైగా చర, స్థిరాస్తులు ఉన్నాయి.

● ఈ సారి మాత్రం గెలుపు కోసమే!

సుగవనేశ్వరర్ ఆలయంలో దుర్గా స్టాలిన్ ప్రత్యేక పూజలు

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సేలంలోని సుప్రసిద్ధ సుగవనేశ్వరర్ ఆలయంలో సీఎం స్టాలిన్ సతీమణి దుర్గాస్టాలిన్ శనివారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యమంత్రితో పాటు శుక్రవారం సాయంత్రం సేలం నగరానికి విచ్చేసిన దుర్గా స్టాలిన్ శనివారం ఉదయం సుగవనేశ్వరర్ ఆలయానికి వెళ్లారు. ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఆమెకు స్వాగతం పలికారు. ఆ తర్వాత స్వామి, స్వర్ణాంబికై అమ్మవారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజలు చేయించారు. లోక్‌సభ ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘనవిజయం సాధించాలని ప్రార్థిస్తూ ఆమె ఈ పూజలు నిర్వహించారని తెలుస్తోంది. అరగంటకు పైగా ఆమె ఆలయంలో గడిపిన తర్వాత సీఎం బస చేస్తున్న అతిథి గృహానికి బయలుదేరి వెళ్లారు.



దైవదర్శనం చేసుకుని తిరిగి వెళుతున్న ముఖ్యమంత్రి స్టాలిన్ సతీమణి దుర్గా స్టాలిన్

ఆలోచించి ఓటేయండి

● సెంట్రల్ చెన్నై బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కుల మతాలతో సంబంధం లేకుండా, నియోజకవర్గానికి ఎవరు ఏ మేరకు ప్రయోజనం చేకూర్చగలరో, ఎవరు అందుబాటులో ఉంటారో గ్రహించి ఓటేయాలని సెంట్రల్ చెన్నై లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి వినోజ్ పి.సెల్వం కోరారు. శనివారం సెంట్రల్ చెన్నైలోని గోపాలపురం, పద్మావతి రోడ్, పీటర్స్ రోడ్, అజీజ్ ముల్క్ వీధి, మోడర్న్ స్కూల్ రోడ్, గులామ్ అబ్బాస్ వీధి, షబ్బీర్ మహమ్మద్ రోడ్, సుదంతర నగర్, గ్రీమ్స్ రోడ్, ఖాదర్ నవాజ్ ఖాన్ రోడ్, రౌట్లాండ్ గేట్, కాలేజ్ రోడ్, మక్కీస్ గార్డెన్ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయాల్లో పూజలు నిర్వహించడంతో పాటు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఆర్థికబలం, అంగబలం చూడొద్దని, తమకు అండగా ఎవరు నిలుస్తారన్నది ప్రజలు గ్రహించి ఓటేయాలని కోరారు. ఎక్కడికెళ్లినా కులమత బేదాల్లేకుండా అపూర్వమైన ఆదరణ లభిస్తోందని తెలిపారు. తాను ఆలయాలతో పాటు దర్గాల్లోనూ, మసీదుల్లోనూ, చర్చిల్లోనూ ప్రార్థనలు నిర్వహించానని, అందరూ తనను తమవాడిగా దరి చేర్చుకుంటున్నారని వివరించారు.



చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో వినోజ్ పి.సెల్వం

● వాకింగ్‌లో ప్రచారం

సేలం కూరగాయల సంతలో స్టాలిన్ ఓట్లవేట

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): డీఎంకే అధ్యక్షుడు, సీఎం ఎంకే స్టాలిన్ శనివారం ఉదయం సేలం నగరంలో వాకింగ్‌కు వెళ్లా అక్కడి కూరగాయల సంతలో పార్టీ అభ్యర్థి సెల్వగణపతికి, కళ్లకురిచ్చి అభ్యర్థి మలయరసన్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఎరుపు రంగు టీషర్టు, నలుపు రంగు ప్యాంట్ ధరించి వచ్చిన స్టాలిన్‌ను చూడగానే కూరగాయల వ్యాపారులు పరుగెత్తుకొని వచ్చి ఆయనతో కరచాలనం చేశారు. మహిళలు ఆయన పక్కనే నిలిచి సెల్ఫీలు తీసుకున్నారు. కొంతమంది గృహిణులు ఆయన కాళ్లకు మొక్కారు. అక్కడే ఉన్న ఓ టీకొట్టులోకి వెళ్లి స్టాలిన్ టీ తాగారు. టీషాపులో పని చేస్తున్న కార్మికుడితో కబుర్లాడారు.



స్టాలిన్‌తో సెల్ఫీ తీసుకుంటున్న యువతీయువకుడు

డబ్బుంటే ఇచ్చేవాళ్లం!



డాక్టర్ రాందాస్

● అయ్యో పాపం.. ఎంత కష్టం?!

పెరంబూర్, మార్చి 30: అరక్కోణం పార్లమెంటు నియోజకవర్గంలో బీజేపీ కూటమి తరఫున పీఎంకే అభ్యర్థిగా బాలు బరిలో నిలిచారు. ఆయనకు మద్దతుగా పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్ శుక్రవారం షోళింగర్‌లో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా రాందాస్ మాట్లాడుతూ... డీఎంకే అభ్యర్థి జగద్రక్షకన్ ఇచ్చే డబ్బుకు ఆశపడి ఆయనకు ఓటు వేయవద్దని పిలుపునిచ్చారు. అదే సమయంలో మన అభ్యర్థి బాలు కూడా డబ్బులు ఇచ్చేవాడే కానీ అతని వద్ద ఇప్పుడు లేవని వాపోయారు. దీంతో అభ్యర్థితో పాటు అక్కడికొచ్చిన ప్రజలూ నోరెళ్లబెట్టారు

వాట్సాప్ అడ్మిన్ల జాబితా సేకరణలో పార్టీల నేతలు

పెరంబూర్, మార్చి 30: వాట్సాప్ అడ్మిన్ల జాబితా సేకరణలో అన్ని పార్టీలు నిమగ్నమయ్యాయి. ప్రస్తుతం సమాచారం చేరవేయడం, వీడియోలు, ఫొటోలు పంపించుకోవడంలో వాట్సాప్ ప్రధాన పాత్ర పోషిస్తోంది. కొందరు కుటుంబసభ్యులు, బంధువులతోను, మరికొందరు స్నేహితులు, ఒక్కో తరగతిలోని విద్యార్థులు, గ్రామాల్లో యువకుల వాట్సాప్ గ్రూపులున్నారు. అలాగే, వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పారిశుధ్య కార్మికులు కూడా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని సమాచారం చేరవేసుకుంటున్నారు. ఈ విధానం పసిగట్టిన డీఎంకే, గత శాసనసభ ఎన్నికల్లో వాట్సాప్ అడ్మిన్ల జాబితా సేకరించి, వారి ద్వారా గ్రూపుల్లో డీఎంకేకు సంబంధించిన వార్తలు, మేనిఫెస్టో, ప్రచారం తదితరాలు పంపించగా మంచి ఫలితం ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రచారంలో ముమ్మరంగా పాల్గొంటున్న పార్టీలు, వాట్సాప్ అడ్మిన్ల వివరాలు సేకరించి, వారితో మాట్లాడి, ఆయా గ్రూపుల్లో తమ తమ పార్టీల ప్రచారానికి సంబంధించి వార్తలు పంపించాలని నిర్ణయించారు. దీంతో, గ్రామ స్థాయి నేతల నుంచి జిల్లా స్థాయి నేతల వరకు వారి వారి పరిధిలోని వాట్సాప్ గ్రూప్స్ అడ్మిన్ల వివరాలు సేకరించాలని పార్టీ అధిష్ఠానాలు కోరినట్లు సమాచారం.

● ఓట్ల కోసం ఎన్ని తిప్పలో...!

దుక్కిదున్ని, నాట్లువేసి ఓట్లవేట



నారుమడిలో దిగి రైతు కూలీలతో కబుర్లాడుతున్న పీఎంకే అభ్యర్థి గణేష్‌కుమార్

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఆరణి లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న పీఎంకే అభ్యర్థి గణేష్ కుమార్ వందవాసిలో ప్రచారం చేశారు. ఆ ప్రాంతంలోని పొలాల్లో ట్రాక్టర్‌తో దుక్కిదున్నారు... నాట్లు వేసి అక్కడి రైతు కూలీలతో కబుర్లాడుతూ ఓట్ల వేట సాగించారు. వందవాసి, తెన్నాంగూరు, పాదిరి వెంగుండ్రం, ముమ్ముని ప్రాంతాల్లో ప్రజలందరికీ కరపత్రాలు పంచిపెట్టి మామిడి పండు గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని అభ్యర్థించారు. పీఎంకే అభ్యర్థి షర్టు, ప్యాంట్ ధరించి మడిలో దిగి నాట్లు వేసేందుకు ప్రయత్నించడం చూసి రైతు కూలీలు విస్తుపోయారు. ఎన్నికల్లో గెలిస్తే రైతుల సంక్షేమానికి అవసరమైన పథకాలను అమలు చేస్తానని గణేష్‌కుమార్ హామీ ఇచ్చారు.

ప్రచారంలో అభ్యర్థే మిస్సయ్యాడు!

పెరంబూర్, మార్చి 30: కరూర్ లోక్‌సభ నియోజకవర్గ అన్నాడీఎంకే అభ్యర్థిగా తంగవేలు బరిలో ఉన్నారు. ఆయనకు మద్దతుగా శనివారం ఉదయం 7 గంటల సమయంలో పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ మంత్రి ఎమ్మార్ విజయభాస్కర్, కూటమి పార్టీల నేతలతో కలసి వీరరాఘ్యం ప్రాంతంలో ప్రచారంలో పాల్గొనేందుకు వచ్చారు. అరగంట గడిచినా అభ్యర్థి తంగవేల్ రాకపోవడంతో, విజయభాస్కర్ టాపులేని జీపులో కూటమి పార్టీల నేతలతో కలసి ప్రచారం ప్రారంభించారు. ఆ ప్రాంతంలో 9 గంటలకు ప్రచారం ముగించుకొని విజయభాస్కర్ వెళ్లినా అభ్యర్థి అప్పటి వరకు రాలేదు. అదే సమయంలో ప్రచారానికి వచ్చే నేతలకు హారతులు, తాంబూలం పళ్లేలతో ఆహ్వానం పలికిన మహిళలకు రూ.50 మాత్రమే ఇవ్వడంతో వారు వాగ్వాదానికి దిగడం కొసమెరుపు.



అభ్యర్థి లేకుండా ప్రచారంలో మాజీ మంత్రి విజయభాస్కర్ (పక్క చిత్రంలో) ప్రచారంలో పాల్గొన్న మహిళలకు రూ.50 అందిస్తున్న నేత



ఎన్నికల భద్రతకు 1.5లక్షల మంది పోలీసులు

● డేగ కన్ను నిఘా

చెన్నై, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు డీజీపీ శంకర్‌జివాల్ చర్యలు చేపడుతున్నారు. ఈ ఎన్నికల్లో అల్లర్లకు తావులేకుండా ఓటర్లు నిర్భయంగా ఓటు వేయడానికి 1.5లక్షల మందితో భద్రతా ఏర్పాట్లు చేపడుతున్నారు. రాజధాని నగరం చెన్నైలోని మూడు నియోజకవర్గాల్లో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సుమారు 20 వేల మంది పోలీసులను నియమించనున్నారు. వీరికితోడుగా 200 కంపెనీల పారా మిలటరీ దళాలను కూడా రప్పిస్తున్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద నిఘా వేయడానికి ప్రత్యేక పోలీసులను నియమించనున్నారు.

ఇప్పటికీ గుర్తున్నానంటే ఇళయరాజా పాటలే కారణం

● రామరాజన్ ● 'సామానియన్' ఆడియో విడుదల

రెండు దశాబ్దాలకు పైగా తన పేరు సినీ ప్రేక్షకుల్లో వినిపిస్తుందంటే దానికి కారణం ఇసైజ్ఞాని ఇళయరాజా పాటలేనని సీనియర్ నటుడు రామరాజన్ అన్నారు. మంచి కథా చిత్రాలను తెరకెక్కించే ఎట్‌సెట్రా ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై రామరాజన్ హీరోగా నిర్మాత వి.మదియళగన్ 'సామానియన్' అనే చిత్రాన్ని నిర్మించారు. ఆర్.రాకేష్ దర్శకుడు. ఈ సినిమా ద్వారా రామరాజన్ రీఎంట్రీ ఇస్తున్నారు. రామరాజన్ సినీ ప్రయాణానికి ఇళయరాజా సంగీతం వెన్నెముక. ఈ చిత్రానికి కూడా ఇళయరాజా సంగీతం స్వరాలు అందించారు. 23 యేళ్ల తర్వాత వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ చిత్రం వస్తోంది. హీరోయిన్లుగా నక్ష శరణ్, స్మృతి వెంకట్, అపర్ణతి నటించారు. ఇతర పాత్రల్లో రాధారవి, ఎంఎస్ భాస్కర్, లియో శివకుమార్, రాజారాణి పాండ్యన్, మైమ్ గోపి, బోస్ వెంకట్, వినోదిని తదితరులు నటించారు. ఎడిటింగ్ రామ్‌గోపి, సినిమాటోగ్రఫీ అరుళ్‌సెల్వన్. ఈ చిత్రం ఆడియో, ట్రైలర్‌ను శుక్రవారం రాత్రి చెన్నైలో అనేక మంది అభిమానులు, సినీ ప్రముఖుల సమక్షంలో విడుదల చేశారు. హీరో రామరాజన్ మాట్లాడుతూ... '2010లో తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఆ తర్వాత ఇలాంటి చిత్రంలో నటిస్తానని కలలో కూడా ఊహించలేదు. నా అభిమానులు, రాష్ట్ర ప్రజల దీవెనలే నన్ను కాపాడాయి. ఈ సినిమా స్క్రీన్‌ప్లే అద్భుతంగా ఉంది. ఈ సినిమాను చూసే మహిళలు, యువతే కాదు పురుషులు సైతం కన్నీరు పెట్టుకుంటారు. ఈ ఆడియో రిలీజ్‌కు ఇళయరాజా వస్తారని భావించాను. అనివార్య కారణాలతో రాలేకపోయారు. గత 23 యేళ్లుగా నన్ను రామరాజన్ అని పిలుస్తున్నారంటే దానికి కారణం ఇళయరాజా పాటలే. ఇప్పటికీ మా ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రాల్లోని పాటలు వింటున్నారు. 44 చిత్రాల్లో నటించిన నాకు 45వ చిత్రం వాయిదా పడుతూ వచ్చింది. చివరకు ఈ సినిమా నన్ను సరైన మార్గంలో నడిపించింది' అన్నారు. దర్శకుడు రాకేష్ మాట్లాడుతూ, '23 యేళ్ళ తర్వాత ఇళయరాజాను, మక్కల్ నాయకన్ రామరాజన్‌ను కలపడమే కాకుండా వారిద్దరితో కలిసి సినిమా తీసే భాగ్యం నాకు దక్కింది' అని అన్నారు. అలాగే, ఈ ఆడియో రిలీజ్ వేడుకలో పాల్గొన్న దర్శకులు పేరరసు, ఆర్.వి.ఉదయకుమార్, కేఎస్ రవికుమార్, శరవణ సుబ్బయ్య, నటులు ఎంఎస్ భాస్కర్, లియో శివకుమార్, రోబో శంకర్, చిత్ర బృందం సభ్యులు ప్రసంగించారు.



ఆడియో రిలీజ్ దృశ్యం

చిత్రజ్యోతి

బాక్సింగ్‌లో మీనాక్షి చౌదరి శిక్షణ



చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టిన అనతికాలంలోనే వరుస అవకాశాలు దక్కించుకున్న యువ హీరోయిన్లలో మీనాక్షి చౌదరి ఒకరు. తమిళం, తెలుగు భాషల్లో అగ్రహీరోల సరసన నటిస్తున్నారు. ఆమె ఇపుడు బాక్సింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. ఇటీవల తన కుటుంబ సభ్యులతో కలిసి థాయిలాండ్ పర్యటనకు వెళ్లిన ఆమె... అక్కడ ఒక ట్రైనర్ పర్యవేక్షణలో బాక్సింగ్‌లో శిక్షణ తీసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. వెంకట్ ప్రభు - విజయ్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది గోట్' సినిమా కోసం ఆమె ఈ శిక్షణ తీసుకున్నారా? లేక స్వీయ రక్షణ కోసం తీసుకున్నారా? లేదా అన్నది తెలియలేదు. కాగా, 2023లో విజయ్ ఆంటోని నటించిన 'కొలై' చిత్రం ద్వారా కోలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామ... ఆర్జే బాలాజీ సరసన 'సింగపూర్ సెలూన్'లో నటించారు. ఆ తర్వాత అగ్రహీరో విజయ్ చిత్రంలో నటించే లక్కీ అవకాశం దక్కించుకున్నారు.